
క్లుప్తంగా

గోదావరికి జలకళ



వరద నీటితో నిండుకుండలా గోదావరి నది

కొవ్వూరు: ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో నాలుగు రోజులుగా గోదావరి నదిలో నీటి ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. వారం రోజుల వరకూ వెలవెలబోతూ దర్శనమిచ్చిన గోదావరి నెమ్మదిగా నదీ గర్భంలోని ఇసుక తిన్నెలను ముంచెత్తుతోంది. క్రమంగా జలకళను సంతరించుకుంటోంది. వరద నీరు పెరగడంతో జిల్లా వ్యాప్తంగా ఓపెన్ రీచ్‌లల్లో ఇసుక తవ్వకాలు పూర్తిగా నిలిచిపోయాయి. సీలేరు జలాలతో కలిపి ఎగువ నుంచి 1,35,430 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది.నాలుగు రోజులుగా వరద నీరు రావడంతో గోదావరిలో నీరంతా ఎరుపు రంగులోకి మారుతోంది.

డెల్టా కాలువలకు నీటి విడుదల తగ్గింపు

నిడదవోలు: ఖరీఫ్ సాగు అవసరాల నిమిత్తం ఆదివారం ధవళేశ్వరం హెడ్ వర్క్స్ అధికారులు డెల్టా కాలువలకు నీటి విడుదలను క్రమబద్ధీకరిస్తున్నారు. దీనిలోభాగంగా మండలంలోని విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు నాలుగు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. పశ్చిమ డెల్టా పరిధిలోని నరసాపురం కాలువకు 1469, ఏలూరు కాలువకు 1302, తణుకు కాలువకు 618 క్యూసెక్కులు, ఉండి కాలువకు 675, అత్తిలి కాలువకు 322 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

నిడదవోలు: నిరాదరణకు గురవుతున్న వృద్ధులను ఆదరించాలని రోటరీ సెంట్రల్ క్లబ్ అధ్యక్షుడు బొల్లా శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రాజుల పాటి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆయన కుమారులు పట్టణంలోని లింగంపల్లిలోని రోటరీ సెంట్రల్ క్లబ్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు, పండ్లు, భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో రోటరీ సెంట్రల్ వృద్ధాశ్రమ అధ్యక్షుడు బూరుగుపల్లి సత్యనారాయణ, క్లబ్ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, మధుసూధనరావు, శ్రీకాంత్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అ'పూర్వ' కలయిక



దేవరపల్లిలోని ఏఎస్సార్ జెడ్పీ హైస్కూల్ 1996-97 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

దేవరపల్లి: స్థానిక ఏఎస్సార్ జెడ్పీ హైస్కూల్ 1996–97 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల ఆత్మీక కలయిక ఆదివారం ఆ కళాశాల ప్రాంగణంలో జరిగింది. అప్పటి విద్యార్థులంతా సమావేశంలో పాల్గొని ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి గురువులను ఘనంగా సత్కరించారు.

లక్ష బిల్వార్చన

నిడదవోలు: మాస శివరాత్రి ఉత్సవాలను ఆదివారం పట్టణంలోని బాలా త్రిపురసుందరి సమేత సోమేశ్వరస్వామివారి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు శ్రీకాకుళపు లక్ష్మీనరసింహశాస్త్రి ఆధ్వర్యంలో స్వామివారికి లక్ష కుంకుమార్చన, లక్ష బిల్వార్చన వైభవంగా జరిపారు. పట్టణ నలమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకుడు పూలపర్తి లక్ష్మీనారాయణ, అభిరామ్, ఆలయ కార్యనిర్వహణాధికారి సోమాల శివ తదితరులు పాల్గొన్నారు.

దేవుడి సొమ్ము ఫలహారం



శ్రీవారి కొండపైన పద్మావతి క్యాంటీన్



క్యాంటీన్‌లో టిఫిన్ చేస్తున్న భక్తులు, వెనుక ఖాళీగా ఉన్న ఏసీ క్యాబిన్

- నష్టాల్లో శ్రీవారి దేవస్థానం క్యాంటీన్
- పెట్టుబడి రాకపోయినా.. కాలక్షేపం చేస్తున్న అధికారులు
- ఆలయ ఉద్యోగులతోనే అన్ని పనులూ..

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపైన దేవస్థానం సొంతంగా నిర్వహిస్తున్న పద్మావతి క్యాంటీన్ నష్టాల్లో నడుస్తోంది. కనీసం పెట్టుబడులు రాకపోయినా ఆలయ అధికారులు క్యాంటీన్‌ను అలానే కొనసాగిస్తున్నారు. దాంతో రోజురోజుకూ స్వామివారి సొమ్ముకు గండి పడుతోంది. వివరాల్లోకి వెళితే.. శ్రీవారి కొండపై ఎనిమిదేళ్ల క్రితం వివిధ అభివృద్ధి పనులు జరిపారు. అందులో భాగంగా ఆలయానికి దూరంగా, తూర్పు వైపున కేశఖండనశాల, బుకింగ్ కౌంటర్లకు మధ్యలో ఈ పద్మావతి క్యాంటీన్‌ను కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించారు. భక్తులకు దూరంగా, సరిగ్గా కనిపించని ప్రాంతంలో క్యాంటీన్ ఉండటంతో ఇందులో వ్యాపారం చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. దాంతో దేవస్థానం ఈ భవన సముదాయంలోని కొంత భాగాన్ని డార్మెటరీగా వినియోగిస్తూ, మిగిలిన భాగాన్ని నిరుపయోగంగా విడిచి పెట్టింది. ఆలయ ఇంజినీరింగ్ విభాగం అధికారుల వైఫలం వల్లే కోట్లాది రూపాయల దేవుడి సొమ్ము దుర్వినియోగం అయ్యిందన్న విమర్శలు ఉన్నాయి. కాగా ఈ భవనంలో వ్యాపారం సాగదని తెలుసుకున్న అధికారులు అప్పటికే తూర్పు వైపు జంటగోపురాల సమీపంలో ఉన్న తాత్కాలిక క్యాంటీన్‌ను లీజుకిస్తూ వచ్చారు. 2021 మే 1 నుంచి, 2023 మే 31 వరకూ క్యాంటీన్‌ను నడిపిన పాటదారుడు నెలకు దేవస్థానానికి సుమారు రూ.2.58 లక్షలకు పైగా చెల్లించారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న అనివేటి మండప విస్తరణ పనుల్లో భాగంగా ఈ తాత్కాలిక క్యాంటీన్‌ను పూర్తిగా తొలగించారు. ఎలాగో భక్తులకు క్యాంటీన్ ఏర్పాటు చేయాలి గనుక, వృథాగా ఉన్న పద్మావతి క్యాంటీన్‌ను వాడుకలోకి తెచ్చి తమపై ఉన్న అపవాదును తొలగించుకోవాలని అనుకున్నారో ఏమో.! తెలియదు కానీ.. ఈ ఏడాది జూన్ 1 నుంచి క్యాంటీన్ నిర్వహణ బాధ్యతను దేవస్థానం అధికారులే స్వయంగా చేపట్టారు. క్యాంటీన్‌లో అల్పాహారాన్ని మాత్రమే విక్రయిస్తున్నారు.

అన్ని పనులూ ఉద్యోగులతోనే..

ఈ క్యాంటీన్‌లో బిల్లు కొట్టే పని దగ్గర నుంచి పప్పు రుబ్బడం, ప్లేట్లు తీయడం, వాటిని కడగడం వంటి అన్ని పనులనూ దేవస్థానం ఉద్యోగులతోనే చేయిస్తున్నారు.రోజూ ఉదయం షిఫ్ట్‌లో 11 మంది, శని, ఆదివారాల్లో 13 మంది, అలాగే రోజూ మధ్యాహ్నం షిఫ్ట్‌లో ఏడుగురు పనిచేస్తున్నారు. వీరిపై ఒక ఏఈఓ, ఒక సూపరింటెండెంట్ పర్యవేక్షణ ఉంటోంది. క్యాంటీన్‌లో మొత్తం అమ్మకం సాధారణ రోజుల్లో రూ.10 వేలు, శని, ఆదివారాల్లో రూ.20 నుంచి రూ.25 వేల వరకూ ఉంటోంది.

క్యాంటీన్ నెల ఆదాయ, వ్యయాలు ఇవీ..

- జూన్ 1 నుంచి 30 వరకూ క్యాంటీన్ ద్వారా వచ్చిన ఆదాయం రూ.3.70 లక్షలు
- అందులో పప్పు, ఉప్పు, వాటర్ బాటిల్స్, గ్యాస్, పాలు వంటి వాటికి అయిన ఖర్చు సుమారు రూ. 2.30 లక్షలు
- సెంట్రల్ ఏసీ, ఇతర విద్యుత్తు వాడకానికి అయిన ఖర్చు సుమారు రూ.90 వేలు
- ఖర్చులు పోగా వచ్చిన ఆదాయంలో మిగిలిన నగదు రూ. 50 వేలు
- అయితే ఉద్యోగుల జీతభత్యాల ఖర్చు సుమారు రూ.2.50 లక్షలు
- దీన్ని బట్టీ చూస్తే నెలకు రూ.2 లక్షల వరకు నష్టం వస్తోంది
- ఇది కాకుండా లీజుకు ఇస్తే వచ్చే ఆదాయం కూడా రూ. లక్షల్లో పోతోంది.

19న బహిరంగ వేలం నిర్వహిస్తాం

క్యాంటీన్‌ను లీజుకు ఇచ్చేందుకు ఈనెల 19న బహిరంగ వేలాన్ని నిర్వహిస్తాం. ఇప్పటికే ఈ ఏడాది మే 31న ఒకసారి బహిరంగ వేలాన్ని నిర్వహించగా, పాటదారులెవరూ అందులో పాల్గొనలేదు. దాంతో గత నెల 26న మరోసారి బహిరంగ వేలాన్ని నిర్వహించగా ఒక పాటదారుడు నెలకు రూ.1.40 లక్షలకు హెచ్చు పాటదారుడిగా నిలిచారు. ఇంకా మంచి ఆదాయం కోసం వేలాన్ని ఈనెల 19కి వాయిదా వేశాం. ఆసక్తిగల వారు పాటలో పాల్గొనవచ్చు.

– వేండ్ర త్రినాథరావు, శ్రీవారి దేవస్థానం ఈఓ

గుబ్బాలమ్మకు ఆషాఢం సారె సమర్పణ



గుబ్బాలమ్మ వారికి ఆషాఢం సారె సమర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: గోపవరం గ్రామంలోని గుబ్బాలమ్మ వారి శాకంబరి ఉత్సవాలు రెండో రోజైన ఆదివారం ఘనంగా జరిగాయి. పూలు, పండ్లు, వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అమ్మవారిని దర్శించుకుని ఆషాఢ సారె సమర్పించారు. అమ్మవారికి కుంకుమ పూజలు, మహాలక్ష్మి హోమాలు, మహాపూర్ణహుతి జరిపించారు. పరిసర గ్రామాల నుంచి తరలి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి సుజాత, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు ముళ్లపూడి శ్రీనివాస్‌కుమార్ చౌదరి, సొసైటీ అధ్యక్షులు సుంకవలి శ్రీహరి, యాళ్ల రామారావు, ఆలయ మేనేజర్ ఎస్.సూర్యప్రకాశరావు, ఆలయ చైర్మన్ వి.రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆరేపల్లి చంటి, దొడ్ల మురళీకృష్ణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేలివెన్ను గ్రామ దేవతలకు..

ఉండ్రాజవరం: ఆషాఢం మాసంలోని చివరి రోజును పురస్కరించుకుని వేలివెన్ను గ్రామ దేవతలైన మహంకాళమ్మ, ముత్యాలమ్మ వార్లకు ఆదివారం రకరకాల పిండి వంటలు, పండ్లు, పసుపు, కుంకమలతో గ్రామస్తులు ఆషాఢ మాస సారె సమర్పించారు. గ్రామంలోని వేంకటేశ్వర స్వామి గుడి నుంచి అమ్మవార్ల ఆలయం వరకు సారె ఊరేగింపు నిర్వహించారు. ఈ వేడుకలో సుమారు 400 మంది మహిళలు పాల్గొన్నారు.

ఇక పొలాల్లో గట్టులంకలు వేయడం ఈజీ !



రైతు ప్రసాద్ వ్యవసాయ క్షేత్రంలో ప్రత్యేక యంత్రంతో గట్టులంక వేస్తున్న దృశ్యం

నల్లజర్ల: ఇప్పటి వరకూ మెట్ట ప్రాంతంలో కొత్త వరి వంగడాలను అభివృద్ధి చేసిన నల్లజర్లకు చెందిన అభ్యుదయ రైతు నిమ్మలపూడి ప్రసాద్ పొలాల్లో గట్టులంకలు వేసే యంత్రాన్ని రైతులకు పరిచయం చేశారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరులో ఈ విధానాన్ని చూసిన ఆయన ఆ యంత్రం నల్లజర్ల పరిసర ప్రాంత రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని భావించి ఇక్కడకు తీసుకు వచ్చారు. తన పొలంలో ఫోర్ వీల్ డ్రైవ్ ఉన్న ట్రాక్టర్‌కు ఈ యంత్రాన్ని అమర్చి కేవలం గంట వ్యవధిలో 5 ఎకరాల్లో గట్టులంకలు వేశారు. సాధారణంగా రైతులు మొదటి దమ్ము తర్వాత గట్టులంకలు వేస్తుంటారు. ట్రాక్టరు పుల్లీకి రోటోవేటర్ అమర్చిన విధంగానే ఈ యంత్రాన్ని అమర్చి 10 మంది కూలీలు చేసే పనిని ఒక గంటలోనే పూర్తిచేయవచ్చని ప్రసాద్ చెప్పారు. ప్రస్తుతం కూలీల కొరత ఎక్కువగా ఉంది. ఈ యంత్రం సాయంతో కూలీల కొరతను అధిగమించడంతో పాటు రూ.800 ఖర్చయ్యేపనికి కేవలం రూ.500తో పూర్తిచేయవచ్చునన్నారు. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లో ఇలాంటి యంత్రాలను అందుబాటులో ఉంచితే రైతులకు లాభదాయకంగా ఉంటుందని ఆయన సూచించారు.

వాహనదారులపై 20 కేసులు

చాగల్లు: చాగల్లులో ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై 20 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

కొవ్వూరు: మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన పల్లెపోగు జోసెఫ్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు పట్టణ ఎస్సై బి.దుర్గాప్రసాద్ తెలిపారు. తెనాలి నుంచి విశాఖపట్నం వెళుతున్న మార్నింగ్ స్టార్ అనే ప్రైవేట్ బస్సులో ప్రయాణిస్తున్న తెనాలికి చెందిన యార్లగడ్డ మౌనికతో గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన జోసెఫ్ అసభ్యకరంగా ప్రవర్తించారు. దీంతో మౌనిక కొవ్వూరు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా రామారావు

కొవ్వూరు: జనసేన పార్టీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు నియమితులయ్యారు.ఈ మేరకు మంగళగిరిలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ అధినేత పవన్ కల్యాణ్ నుంచి నియామక పత్రం అందుకున్నారు.

ఓటర్లుగా నమోదు చేయాలి

చాగల్లు: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఈ నెలాఖరులోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ కె. రాజ్యలక్ష్మి సూచించారు. బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు.

ఆ కుటుంబానికి కష్టకాలంలో అండగా..



షకీలా కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందిస్తున్న వలంటీర్ ఇర్ఫాన్

సమిశ్రగూడెం గ్రామానికి చెందిన షేక్ షకీలా గతేడాది డిసెంబర్‌లో వ్యాన్‌పై సామర్లకోట వెళ్తూ అదుపు తప్పి పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై మృతి చెందింది. దీంతో షకీలా క్లస్టర్ పరిధిలోని వలంటీర్ షేక్ ఇర్ఫాన్ కష్టకాలంలో ఉన్న ఆ కుటుంబానికి అండగా నిలిచాడు. మృతురాలు షకీలాకు డెత్ సర్టిఫికెట్‌తో పాటు వైఎస్సార్ బీమా పొందేందుకు కావాల్సిన ధ్రువపత్రాలను వలంటీర్ ఇర్ఫానే స్వయంగా సిద్ధం చేసి సచివాలయంలో దరఖాస్తు చేయించాడు. దీంతో ఆ కుటుంబానికి రూ.5 లక్షల బీమా సొమ్ము బ్యాంక్ ఖాతాలో ప్రభుత్వం జమ చేసింది. షకీలాకు మూడు సార్లు వైఎస్సార్ చేయూత లబ్ధి పొందింది.

– నిడదవోలు రూరల్

వలంటీర్లకు వందనం

అల్లా ఇచ్చిన బాయ్ ఇర్ఫాన్..



వలంటీర్ షేక్ ఇర్ఫాన్ మా కుటుంబానికి అల్లా ఇచ్చిన భాయ్..నాకు నాన్న లేడు. అమ్మ షకీలాకు వితంతు పింఛనుతో పాటు వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా లబ్ధి పొందింది. యాక్సిడెంట్‌లో అమ్మ చనిపోవడంతో ఏంచేయాలో తోచలేని స్థితిలో వలంటీర్ ఇర్ఫాన్ మాకు అండగా నిలిచాడు. ప్రభుత్వ పథకాలతో పాటు వైఎస్సార్ బీమా పొందేందుకు వలంటీర్ ఇర్ఫాన్ చేసిన సాయం జీవితంలో మరిచిపోలేను. మా పిల్లలకు కూడా అమ్మ ఒడి వస్తోంది. ఏ కార్యాలయాలకు, అధికారుల వద్దకు వెళ్లకుండానే మాకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి.

– కరీముల్లా, సమిశ్రగూడెం

ఎయిడెడ్ స్కూల్లో ఎస్‌ఆర్‌ల రగడ

ముగ్గురు టీచర్లకు ఇక్కట్లు

నల్లజర్ల: పోతవరంలోని వివేకానంద ఎయిడెడ్ స్కూల్ నుంచి ప్రభుత్వ పాఠశాలకు సర్దుబాటు అయిన ముగ్గురు ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిస్టర్ (ఎస్‌ఆర్) ఇచ్చేందుకు ఆ ఎయిడెడ్ స్కూల్ యాజమాన్యం నిరాకరిస్తోంది. వివరాలిలా ఉన్నాయి. ప్రభుత్వం తీసుకున్న విధాన నిర్ణయంలో భాగంగా ఈ స్కూల్‌ను గత నెలలో ప్రభుత్వంలో విలీనం చేశారు. ఇక్కడ పనిచేస్తున్న కొండ్రెడ్డి సూర్యకుమారి, వల్లభనేని సుజాత, దమిడి నాగేశ్వరరావు అనే ఎయిడెడ్ టీచర్లను సమీప ప్రభుత్వ పాఠశాలల్లో సర్దుబాబు చేశారు. అయితే వారి ఎస్‌ఆర్‌లు ఇచ్చేందుకు వివేకానంద ఎయిడెడ్ స్కూల్ కరస్పాండెంట్ టీఎస్ఎన్ లక్ష్మి నిరాకరిస్తున్నారు. దీనిపై ఆ ముగ్గురూ ఈ నెల10న స్పందనలో ఫిర్యాదు చేశారు. డీఈఓ ఆదేశాల మేరకు నల్లజర్ల ఎంఈఓ యర్రోజు సత్యనారాయణ కరస్పాండెంట్ లక్ష్మిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు. ఫిర్యాదు చేసి వారమైనా ఇంతవరకూ ఈ విషయంలో ఎలాంటి కదలికా లేదని ఎంఈఓ సత్యనారాయణ విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. దీనిపై ఎస్‌ఐ నరసింహమూర్తిని వివరణ కోరగా ఫిర్యాదు వచ్చిన మాట వాస్తవమే అన్నారు. కరస్పాండెంట్ లక్ష్మిని పిలిపించి మాట్లాడామని, తమ ముగ్గురు ఎయిడెడ్ ఉపాధ్యాయులను ఎక్కడ నియమించారో చెబితే సంబంధిత ఎంఈఓకు వారి సర్వీసు రిజిస్టర్లు అప్పగిస్తామని చెబుతున్నారన్నారు.

సూర్యకుమారికి ఏడాదిగా అందని జీతం

ఈ ముగ్గురు ఎయిడెడ్ టీచర్లలో కొండ్రెడ్డి సూర్యకుమారి ఎక్కువ బాధితురాలు. ఆమెకు ఏడాదిగా జీతం రావడం లేదు. ఆ వివరాలిలా ఉన్నాయి. 60 ఏళ్ల వయసు నిండడంతో 2022 జూన్‌లో ఆమె రిటైరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం టీచర్ల ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచడంతో సూర్యకుమారి మళ్లీ పాఠశాలకు వెళ్లారు. గత నెల వరకు ఇదే పాఠశాలలో పనిచేసినప్పటికీ ఆమె ఫిట్‌నెస్ సరిగా లేదంటూ రీ జాయిన్‌కు కరస్పాండెంట్ నిరాకరించారు. డీఈఓ ఆదేశాల మేరకు సూర్యకుమారి నిత్యం పాఠశాలకు వెళ్లి ఫేషియల్ అడెండెన్స్ వేసేది. జీతం ఇవ్వడానికి కరస్పాండెంట్ నిరాకరిస్తూ, జాయినింగ్ కూడా చేసుకోలేదు. దీనిపై సూర్యకుమారి స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆ పాఠశాల కరస్పాండెంట్ షిప్ రద్దు చేసి ఆ పాఠశాలకు స్పెషలాఫీరుగా ఎంఈఓను నియమించారు. ఎంఈఓ ద్వారా సూర్యకుమారి మళ్లీ విధుల్లో చేరారు. ఈ ఏడాది జూన్ నుంచి వివేకానంద ఎయిడెడ్ స్కూల్ మూసి వేసి, మరో ఇద్దరితో కలసి సూర్యకుమారిని వేరే పాఠశాలలకు సర్దుబాటు చేశారు. కొత్తగా వెళ్లిన చోట ముగ్గురికీ ఎస్‌ఆర్ లేక పోవడంతో జీతం బిల్లు చేయడం కుదరడం లేదు. అయితే సూర్యకుమారికి మాత్రం ఏడాదిగా జీతం రావడం లేదు.

రామకృష్ణకు మంత్రి వనిత పరామర్శ



రామకృష్ణ తల్లి బంగారమ్మ చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న హోం మంత్రి వనిత

కొవ్వూరు: పశివేదల రంగరాయ ఎల్‌పీసీఎస్ అధ్యక్షుడు మారిన రామకృష్ణను ఆదివారం రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత పరామర్శించారు. ఇటీవల ఆయన తల్లి బంగారమ్మ మృతి చెందారు. దీంతో మంత్రి నందమూరులోని ఆయన స్వగృహానికి వెళ్లి బంగారమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రామకృష్ణ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, ఉప్పులూరి సూరిబాబు, యండపల్లి రాంబాబు, మారిన సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.అంతకుముందు పార్టీ కొవ్వూరు నియోజకవర్గ పరిశీలకుడు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు ఎస్.రాజీవ్‌కృష్ణ నందమూరులోని రామకృష్ణ ఇంటికి వెళ్లి పరామర్శించారు.తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలిపారు. ఎంపీపీ కాకర్ల నారాయుడు, గారపాటి వెంకటకృష్ణ, కలగర గణేష్, ఉప్పులూరి రాజబాబు, మద్దిపాటి సురేష్, కంటిపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం పెట్రోల్ బంక్ వద్ద ఈనెల 15వ తేదీ రాత్రి కారు ఢీకొని తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు జిలానుస్నీషాబేగం మృతి చెందినట్టు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ ఆదివారం తెలిపారు. సమిశ్రగూడేనికి చెందిన జిలానుస్నీషా బేగం (65) తన మనవడైన షేక్ షారుక్‌తో అతడి బైక్‌పై ప్రయాణిస్తోంది. వారు సమీపంలోని పెట్రోల్ బంక్‌లోకి వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న కారు ఢీ కొట్టింది. దీంతో తలకు తీవ్ర గాయాలైన జిలానుస్నీషా బేగం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు కం రైలు వంతెనపై ట్రాఫిక్ జామ్

కొవ్వూరు: రోడ్డు కం రైలు వంతెనపై ఆదివారం సాయంత్రం ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మోటార్ సైకిల్‌ను కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న యువతి గాయపడింది. ఢీకొట్టిన కారు ఆపకుండా వెళ్లిపోయారు. ఈ ఘటనతో బ్రిడ్జిపై సుమారు కిలోమీటరు పొడవునా వందలాది వాహనాలు ట్రాఫిక్‌లో చిక్కుకున్నాయి. యువతి వెంట మోటార్ సైకిల్‌పై వచ్చిన ఆమె బంధువులు ఆమెను ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియరాలేదు. ట్రాఫిక్ నిలిచిపోవడంతో గాయపడిన యువతికి సపర్యలు చేస్తున్న వారికి, వాహనదారులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది

పేదింటి పిల్లలు.. చదువులో మెరిశారు

- ట్రిపుల్ ఐటీకి నల్లజర్ల మండల నుంచి ఐదుగురి ఎంపిక
- వారిలో నలుగురు బాలికలే
- అందరూ అల్పాదాయ వర్గాల వారే..



అనిల్‌ను సత్కరిస్తున్న ముసుళ్లగుంట గ్రామపెద్దలు



ఐనాల చాందిని



చోడసాని వైష్ణవి



మర్రి తనుష్క



యంత్రపాటి సంగీత



హర్షవర్ధిని



బాల దుర్గా శిరీష



ఆనంద్ గోపాల్

నల్లజర్ల: వారందరూ పేదింటి పిల్లలే. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబాల వారే. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారే. అయితేనేమి ప్రతిభలో తాము ఎవరికీ తీసిపోమని నిరూపించుకున్నారు. మండలంలో ఐదు జెడ్పీ ఉన్నత పాఠశాలల ఒక్కొక్కరు చొప్పున విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. నల్లజర్ల జెడ్పీ హైస్కూల్ నుంచి ఐనాల చాందిని, తూర్పుచోడవరం జెడ్పీ హైస్కూల్ నుంచి చోడసాని వైష్ణవి, అనంతపల్లి జెడ్పీ హైస్కూల్ నుంచి మర్రి తనుష్క , సింగరాజుపాలెం జెడ్పీ హైస్కూల్ నుంచి యంత్రపాటి సంగీత, పుల్లలపాడు జెడ్పీ హైస్కూల్ నుంచి చింతలపూడి అనిల్ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు తెలిపారు.

- ఐనాల చాందిని తండ్రి రాంబాబు ఆటో డ్రైవరు. ఆయన రోజూ తన కుమార్తెను ఉదయం, సాయంత్రం మారెళ్ళమూడి నుంచి దాదాపు 6 కిలోమీటర్ల దూరంలోని పాఠశాలకు తీసుకు వచ్చేవాడు. ఆమెకు ఇడుపులపాయలో సీటు లభించింది.
- చోడసాని వైష్ణవి అతి సామాన్య కుటుంబంలో పుట్టింది. తండ్రి రాజారావు వ్యవసాయ కూలీ.ఆమెకు ఇడుపులపాయలో సీటు లభించింది.
- అనంతపల్లికి చెందిన మర్రి తనుష్క తండ్రి శ్రీనివాసరావు పక్షవాతంతో మంచాన పడ్డాడు. కుటుంబ భారం అంతా తనుష్క చూసుకోవాల్సి వచ్చింది. ఇంటి వద్ద చిన్న కిరణా షాపు నిర్వహిస్తూనే మరో పక్క చదువు సాగించింది. స్కూల్ టాపర్‌గా నిలచింది.
- సింగరాజుపాలెంకు చెందిన యంత్రపాటి సంగీత తండ్రి చిన్నబ్బులు వ్యవసాయ కూలీ. పని ఉంటే తప్ప కుటుంబం గడవడం కష్టం.అటు వంటి కుటుంబం నుంచి వచ్చిన సంగీత ఉన్నత చదువులు చదవాలని గ్రామస్తులు ఆకాంక్షిస్తున్నారు.
- పుల్లలపాడు హైస్కూల్లో చదివిన ముసుళ్ళగుంటకు చెందిన చింతలపూడి అనిల్ తండ్రి బంగారయ్య వ్యవసాయ కూలీ. తండ్రితో పాటు అప్పడప్పుడు అనిల్ కూడా పొలం పనులకు వెళ్లి కుటుంబానికి చేదోడుగా ఉంటున్నాడు. అనిల్ 575 మార్కులు సాధించి పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచి కాకుండా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. గ్రామపెద్దలు విద్యార్థి అనిల్‌తో పాటు అతని తండ్రి బంగారయ్యను సత్కరించి, రూ.3 వేల పారితోషికాన్ని అందించారు.గ్రామపెద్దలు కొమ్ము బ్రహ్మయ్య, చెక్కా పుల్లారావు, సిరంగుల పోతురాజు, దగాని వెంకట్రావు, ముద్దన రంగారావు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి జగన్నాథపురం విద్యార్థిని ఎంపిక

గోపాలపురం: మండలంలోని జగన్నాథపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని పి.హర్షవర్ధిని ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. టెన్త్‌లో 577 మార్కులు సాధించిన ఆమెకు నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు లభించినట్టు హెచ్ ఎం వి. శంకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హర్షవర్ధినిని జగన్నాథపురం సర్పంచ్ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ వంగా నారాయణమ్మ గ్రామస్తులు అభినందించారు.

ఉండ్రాజవరం హైస్కూల్ నుంచి ఇద్దరు..

ఉండ్రాజవరం: స్థానిక ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని హెచ్‌ఎం వి.విశ్వప్రసాద్ ఆదివారం తెలిపారు. ఎం.బాలదుర్గా శిరీష, పొత్తాబత్తుల ఆనంద్‌గోపాల్ అనే వారు శ్రీకాకుళం క్యాంపస్‌కు ఎంపికయ్యారన్నారు. టెన్త్‌లో శిరీష 568 మార్కులు, ఆనంద్ గోపాల్ 467 మార్కులు సాధించారని తెలిపారు.